క్లుప్తంగా

అనంతేశ్వరస్వామికి పూజలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో కొలువైన అనంతేశ్వరస్వామి వారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు కాశీ పండిట్ బ్రహ్మశ్రీ ఆదిత్యమిశ్రా ఆధ్వర్యంలో అనంతేశ్వరస్వామికి లఘున్యాస పూర్వక పంచామృత, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అలాగే ముత్యాలమ్మ అమ్మవారికి నిత్యకైంకర్యాలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ నిర్మాణకర్తలు బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులు పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన మాలంపాటి రామకృష్ణయ్య ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఘనంగా అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

చింతలపూడి: అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధికి వాణిజ్యమే వెన్నెముక అని అన్నారు. వాణిజ్య రంగంలో యువతకు అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని చెప్పారు. కళాశాల వాణిజ్య విభాగ అధిపతి రాజాబాబు డిజిటల్ కామర్స్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఇ-కామర్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు వ్యాపార పద్ధతులను ఎలా మారుస్తున్నాయో, పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలను ఎలా కల్పిస్తున్నాయో వివరించారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు కే శాంతి బాబు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కుక్కునూరు: నేటి పాలక వర్గాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక చట్టాలను మారుస్తూ, కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని, వీటిపై కార్మికులంతా ఏకమై పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ 7 వ మండల మహాసభ స్థానిక చర్చి హాస్టల్ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా 200 మంది కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. మహాసభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మడివి దుర్గరావు, మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేంద్రరావు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు యడవల్లి విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కామవరపుకోట: షాట్ పుట్ త్రో లో రాష్ట్రస్థాయి పోటీలకు ఈస్ట్ యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.కోటేశ్వరి తెలిపారు. ఈనెల 3వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ అండర్ 18 విభాగం షాట్ పుట్ త్రోలో పాఠశాలకు చెందిన పెట్ల నంది బాబు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె వివరించారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి షాట్ పుట్ త్రో పోటీల్లో నందిబాబు పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.రవిని, విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ

కొయ్యలగూడెం: వ్యాధినిరోధక టీకా కార్యక్రమం యువిన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేసే ప్రక్రియపై కొయ్యలగూడెం పీహెచ్‌సీలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యువిన్ డివిజనల్ కోఆర్డినేటర్ ఎం.సామిత్ మాట్లాడుతూ ఇమ్యునైజేషన్ కార్యక్రమం డిజిటలైజేషన్ ప్లాట్‌ఫారంకి మారిందని, టీకాలు వేయడానికి ఆన్‌లైన్‌లో శ్లాట్ బుక్ చేసుకొని, వాక్సిన్ తీసుకెళ్లి, టీకాలు వేసిన పిల్లలు అందరి వివరాలను యువిన్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. అదే రోజు వాక్సినేషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసి లబ్ధిదారునికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యువిన్ వీసీఎంఎన్ గిరి సతీష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతి.. మనసా స్మరామి




ఎం.నాగులపల్లిలో మట్టి వినాయకుని ప్రతిమను తయారుచేస్తున్న దృశ్యం



ముస్తాబైన మూడు అడుగుల విగ్రహాలు



విగ్రహాల తయారీకి వినియోగిస్తున్న పత్తి దూది, కొబ్బరి పీచు



సర్ప గణేశుడు

- చవితికి విభిన్న రూపాల్లో ముస్తాబవుతున్న గణనాథుని ప్రతిమలు
- విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు
- మట్టి విగ్రహాలే మేలంటున్న పర్యావరణ ప్రేమికులు

ద్వారకాతిరుమల: ప్రధాన పూజ్యుని పండుగ వచ్చేస్తోంది. చవితి సంబరాలకు గణనాథుడు సిద్ధమవుతున్నాడు. పండుగ కోసం బొజ్జగణపయ్య ప్రతిమలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. పండుగకు మరో 22 రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లాలో గణేష్ విగ్రహాల తయారీ ఊపందుకుంది. వీటి తయారీ, విక్రయాలపై ఎన్నో కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. ప్రస్తుతం ఆ కుటుంబాలన్నీ విగ్రహాల తయారీలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి. ఇప్పటికే గణేష్ విగ్రహాలు దాదాపు ముస్తాబు కాగా, భారీ విగ్రహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఈ క్రమంలో కొందరు కళాకారులు పర్యావరణ పరిరక్షణకై మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే తయారు చేస్తున్నారు.

కుటుంబమంతా కలసికట్టుగా..

ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి శివారులోని జాతీయ రహదారి పక్కన, భీమడోలు మండలం పొలసానిపల్లి గ్రామానికి చెందిన పేరవరపు నాగేశ్వరరావు గత 25 ఏళ్లుగా గణేష్ మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాడు. వీటి తయారీలో నాగేశ్వరరావుకు తన భార్య అన్నపూర్ణ, రెండవ కుమార్తె లంకా భారతి, పెద్ద అల్లుడు నాగరాజు, మనుమడు గౌతమ్ సహకరిస్తున్నారు. మూడు నెలల క్రితం ఈ విగ్రహ తయారీ పనులను ప్రారంభించారు. ప్రత్యేక ఆర్డర్లతో పాటు, అదనంగా మరికొన్ని విగ్రహాలను తయారు చేస్తున్నారు. పండుగ ముందురోజు సైతం విగ్రహాలను విక్రయిస్తామని నాగేశ్వరరావు చెబుతున్నారు. ఈ కుటుంబం దసరాలో దుర్గాదేవి విగ్రహాలు, వేసవిలో కుండలు, కూజాలను తయారు చేసి విక్రయిస్తోంది.

ఆర్డర్ ముందే ఇవ్వాలి..

ఇక్కడ 5 అడుగులకు మించి ఎత్తు విగ్రహాలు కావాలంటే ముందే ఆర్డర్ ఇవ్వాలని నాగేశ్వరరావు అంటున్నారు. అయితే విగ్రహం సైజును బట్టి ధరను నిర్ణయించి, విక్రయిస్తున్నారు. ఐదు అడుగుల విగ్రహం రూ.10 వేలకు పైగా పలుకుతోంది. ఇప్పటికే ఏలూరు, భీమడోలు, అంబరుపేట, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం తదితర ప్రాంతాల వారు విగ్రహాలను బుక్ చేసుకున్నారు.

మట్టి ప్రతిమలతోనే మేలు..

పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలు ఎంతో మేలు చేస్తాయని నిపుణులు, పెద్దలు అంటున్నారు. మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని శాస్త్రంతో పాటు, పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ఆ దిశగానే ప్రతి ఏటా కొందరు చిన్నచిన్న మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో ముప్పు..

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల పర్యావరణ పరంగానే కాకుండా తాగునీరు కలుషితం అవుతుంది. దీని పర్యావసానాలు మరిన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా మనకు కనబడుతున్నాయి. విద్యావంతులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ప్రభుత్వ సహకారం కావాలి



సహజసిద్ధంగా లభించే బంక మట్టి, వరిగడ్డి, పత్తి దూది, కొబ్బరి పీచు వంటి వాటిని వినియోగించి విగ్రహాలను తయారు చేస్తున్నాం. మట్టితో విగ్రహాలు తయారు చేయాలంటే చాలా కష్టం. అయినా పర్యావరణ పరిరక్షణ కోసం గత 25 ఏళ్లుగా వాటిని తయారు చేసి, విక్రయిస్తున్నాం. అయితే ఆకర్షణీయంగా కనిపించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మా పొట్టగొడుతున్నాయి. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అలాగే తయారీకి ప్రభుత్వం అవసరమైన స్థలాలను కేటాయించి, రుణాలను మంజూరు చేయాలి.

– పేరవరపు నాగేశ్వరరావు, విగ్రహాల తయారీదారుడు

చేదోడు వాదోడుగా..



వంశపారంపర్యంగా ఈ విగ్రహాలను తయారు చేస్తున్నాం. నా తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులమంతా చేదోడు వాదోడుగా నిలుస్తూ విగ్రహాలకు జీవం పోస్తున్నాం. రాత్రింబవళ్లు శ్రమిస్తేనే అనుకున్న సమయానికి విగ్రహాలను అందించగలం. పర్యావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాలనే ప్రతి ఒక్కరూ వినియోగించాలి.

– లంకా భారతి, నాగేశ్వరరావు కుమార్తె

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



వ్యవసాయ కార్మికులు కరపత్రాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

లింగపాలెం: ఈనెల 10, 11, 12 తేదీల్లో ధర్మాజీగూడెంలో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ఈమేరకు సోమవారం ధర్మాజీగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ శిక్షణ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 150 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై సంఘం నిరంతరంగా పోరాడుతోందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకురాలు తామా ముత్యాలమ్మ, అశోక్, రాజశేఖర్, రాంబాబు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

చింతలపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చింతలపూడి నగర పంచాయతీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నగర పంచాయతీ యూత్ విభాగం అధ్యక్షుడిగా గోల్కొండ సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బూసి అన్నపూర్ణ, రైతు విభాగం అధ్యక్షుడిగా బత్తినీడి శివప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడిగా డోకల రాము, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొవ్వూరు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా దేశావతు బద్దు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ రఫీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గుమ్మళ్ల దేవదాన విజయకుమార్, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా కాటూరి శేఖర్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా గొట్టాపు శ్రీనివాసరావు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా కొత్తపల్లి అఖిల్, వాలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా ఏలూరి మలపరాజు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా మారుమూడి చంద్రమోహన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కొనకళ్ళ విశ్వేశ్వరరావు, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా వానపల్లి సత్తిబాబు, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా కొమ్ము ఏసుబాబు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా బొల్లం వెంకటలక్ష్మి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా పింగుల డేవిడ్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా నంబూరి సర్వేశ్వరరావు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా రెబ్బ గోపీనాథ్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా బందెల ప్రతాప్ కుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఒడిత్య నాగు, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా వైవీ సుబ్రహ్మణ్య కుమార్, ఇంటలెక్చువల్ ఫొరం అధ్యక్షుడిగా బందెల ఆనందరావు, బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా వెంప కృష్ణ, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా బండారు రమేష్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లింగపాలెంలో...

లింగపాలెం: వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. లింగపాలెం మండల యూత్ విభాగం అధ్యక్షుడిగా చీదరాల ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షులుగా సీహెచ్ విమల, రైతు విభాగం అధ్యక్షుడు ఒబిలనేని గురునాధం, బీసీ సెల్ అరిగల రాధాకృష్ణ, ఎస్సీసెల్‌కు వడ్లాని ప్రమోద్, ఎస్టీ సెల్‌కు మార్ల నాగేశ్వరరావు, మైనార్టీ సెల్‌కు షేక్ వల్లీ సాహెబ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు మాదాసి దావీదు రాజు, స్టూడెంట్ వింగ్‌కు మేకల దానియేల్‌రాజు, పంచాయతీరాజ్ వింగ్‌కు తాడేపల్లి శాంతారావు, ఆర్టీఐ వింగ్‌కు దొడ్డిగర్ల రవీంద్ర బాబు, వలంటీర్స్ వింగ్‌కు ముల్లగాని ప్రసాద్‌రెడ్డి, గ్రీవెన్స్‌సెల్‌కు సందిపాము రాంబాబు, వాణిజ్య విభాగానికి నారిశెట్టి రామారావు, వీవర్స్ వింగ్‌కు సీకాకొల్లు కిరణ్, వైఎస్సార్ టీయూసీకి దాసరి చిన్ని, అంగన్‌వాడీ వింగ్‌కు తగరం హేమలత, లీగల్ సెల్‌కు వి.అహరోన్, కల్చరల్ వింగ్‌కు సీహెచ్ విజయభాస్కర్, సోషల్ మీడియా వింగ్‌కు పల్లి రాంబాబు, ఐటీ వింగ్‌కు దయ్యాల యువరాజ్, దివ్యాంగుల విభాగానికి గంగుల గురునాధం, డాక్టర్స్ వింగ్‌కు పిల్లి భాస్కరరావు, ఇంటలెక్చువల్స్ ఫోరంనకు భీమిరెడ్డి సోమిరెడ్డి, బూత్ కమిటీ వింగ్‌కు ఉప్పలపాటి గోపి, పబ్లిసిటీ వింగ్‌కు ఎ.జయరాజు నియమితులయ్యారు.

పౌర సేవలను సద్వినియోగం చేసుకోండి

కామవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం సుమారు 530 రకాల పౌర సేవలను మన మిత్ర యాప్ ద్వారా అందిస్తుందని, ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే ఈ సేవలను సులభంగా పొందవచ్చని కామవరపుకోట ఎంపీడీఓ ఎం.సరళ కుమారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ గురించి ఈ నెల 5న మండలంలోని అని గ్రామ సచివాలయలాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఈ యాప్ ద్వారా ప్రజలు పౌర సేవలు పొందేలా అవగాహన కల్పించనున్నారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట శిబిరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు దాడి చేశారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

అంకాలంపాడు వైఎస్సార్ సీపీ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులు

కామవరపుకోట: అంకాలంపాడు గ్రామ పంచాయతీ వైఎస్సార్ సీపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ పరిశీలకులు, కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిన కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయంకుల సత్యనారాయణ నూతన కమిటీని ప్రకటించారు. పార్టీ అంకాలంపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కిలారు గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా కొత్తపల్లి వెంకటరత్నం, దొప్పసాని శ్రీను, పైడిమర్ల ఏసురెడ్డి, బత్తుల నాగేశ్వరరావు, కొలుకులూరి వెంకటేషు, కార్యదర్శులుగా వంశీకృష్ణ, బడిపెట్ల ప్రతాప్, కలపాల కిరణ్, దూదిపాల మంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయంకుల, కనకరాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసేలా నూతన కమిటీ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కీసరి సరితా విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీహరి రెడ్డి, ఎంపీటీసీ బీఎస్ఎన్, రఘుపతి రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి



చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చింతలపూడి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. అనంతరం పనిచేయని ఫోన్‌లను ఇన్‌చార్జి సీడీపీఓకి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు టి మాణిక్యం, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సరోజినీ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకర్, బాల సంజీవని, యాప్ అమలుకు సపోర్ట్ చేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్ ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనను అమలు చేయటానికి అంగన్‌వాడీ వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంగన్ వాడీ సెంటర్లకు సరుకులు అన్నీ ఒకసారిగా రావడం లేదని, నెట్ సిగ్నల్ లేకపోవడం వలన, సర్వర్లు పని చేయకపోవడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్ గా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్, ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్లు, 5జీ నెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి సరళ దేవి, నాయకత్వంలో సెక్టార్ నాయకులు, వర్కర్లు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



శ్రీవారి దేవస్థానం పాఠశాలలో విద్యార్థికి బుక్స్, యూనిఫామ్, బ్యాగ్, బెల్టులను అందజేస్తున్న ఆలయ ఈఓ

ద్వారకాతిరుమల: విద్యార్థుల చదువుకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన కందాడై శ్రీనివాసాచారి చినవెంకన్న దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 285 మంది విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు, బెల్టులు కొనుగోలు నిమిత్తం రూ. 5.44 లక్షలను అందించారు. అలాగే ఉండ్రాజవరంనకు చెందిన శ్రీ బాలబాలాజీ శ్రీనివాసా పౌల్ట్రీస్ నిర్వాహకులు మల్లెన రంగారావు, మల్లెన శేషగిరిరావు పాఠ్య పుస్తకాల కొనుగోలుకు రూ.1,65,118 అందజేశారు. ఈ నగదుతో కొనుగోలు చేసిన యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు, బెల్టులు, పాఠ్య పుస్తకాలను ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు సూచనల మేరకు, ఈఓ సత్యన్నారాయణ మూర్తి స్థానిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అందజేశారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



జంగారెడ్డిగూడెం: మాతన్నగూడెంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: చొప్పరామన్నగూడెంలో తల్లిపాల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పుట్టిన బిడ్డకు గంట లోపే తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు సహజ రోగ నిరోధక శక్తి ఏర్పడుతుందని సీడీపీఓ పి.బ్యూల అన్నారు. మాతన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రిపాలతో బిడ్డకు బలమైన పౌష్టికాహారం అంది సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. తల్లి పాలు ఇవ్వడం ద్వారా తల్లులు కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధుల రావని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.పద్మజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయనిర్మల, దేబోర, శ్యామల కుమారి, దేవీ, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ నవ్య, స్కూల్ టీచర్ పాల్గొన్నారు.

చొప్పరామన్నగూడెంలో...

కొయ్యలగూడెం: తల్లిపాల అవగాహన కార్యక్రమం చొప్పరామన్నగూడెంలో సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పొంగుటూరు సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల విశిష్టతను బాలింతలకు, గర్భిణులకు వివరించారు. ముఖ్యంగా బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రిపాలు ఇవ్వడం శిశువుకు ఎంతో క్షేమదాయకం అన్నారు. శిశువుకి ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు తప్పనిసరిగా అందజేయాలని తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, కుమారి, మేరి, సునీత తదితరులు పాల్గొన్నారు.


బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కామవరపుకోట: బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కామవరపుకోట అంగన్‌వాడీ కేంద్రంలో చంటి పిల్ల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మంగాదేవి మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలని తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుక్కునూరు: గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొన్నె లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా కుక్కునూరు మండల కమిటీ నియామకాన్ని చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం కన్వీనర్‌గా నకిరికంటి సంతోష్, కమిటీ సభ్యులుగా కురాకుల ఆనందరావు, కుండా శేషగిరి, అవులూరి వెంగళరావు, మాచర్ల శ్రీను, రాజేష్ ,కృష్ణార్జున్‌రావు, గాడిద కృష్ణ, వేల్పుల తిరుపతమ్మలను ఎన్నుకున్నారు.

చదువు పట్ల శ్రద్ధ వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీవితంలో ఎదుగుదలకు ఇంజినీరింగ్ ప్రథమ మెట్టని ప్రతి విద్యార్థీ తలదించి 20 సంవత్సరాలు చదివితే 80 సంవత్సరాల పాటు జీవితం సాఫీగా సాగేలాగా ఉంటుందని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తమ ఆశయ సాధన కోసం చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.